# రాజు

★

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

"రాజూ! అన్న సంబోధనం వినిపించింది. ప్రక్కయింట్లో. నాకు తెలిసినంతలో ప్రక్కయింటి వాళ్ళ పిల్లలో రాజు శబ్దవాచ్యులు లేరు.

నేను ఆశ్చర్యంగా చూస్తుంటే, మా అబ్బాయి వచ్చాడు. "నాన్నగారూ! రాజు అనేది క్రొత్తగా తెచ్చిన కుక్కపిల్లకు ముద్దుపేరు" అనాడు. ఏదేళ్ళనుంచి వారు దానిని సాకుతున్నారు. వాళ్ళే కాకుండా మావాడు కూడా దానిని "రాజూ!" అని పిలవటానికి అలవాటు పడ్డాడు. అది తోక ఆడిస్తూ దగ్గరకు వచ్చేది.

ఎన్నిబట్టి అది పెద్దదయి బలిసినా, ఎవ్వరి జోలికి పోయేదికాదు. రాత్రిపూట అలికిడి అయితే మొరిగేది. ఆ దారిని కుక్కలు వస్తుంటే తరిమికొట్టేది. అది క్రమంగా మా ఇంటి ఆవరణలోకి కూడా రాసాగింది.

తలుపులు తెరచివున్నా ఇంట్లోకి అడుగు పెట్టేదికాదు. ఎదురుగా తినే పదార్థంవున్నా, దానికి వేస్తేతప్ప తినేదికాదు. ప్రక్క ఇంటికీ మా ఇంటికి అడ్డంగావున్న గోడ మీద పడుకొని రాత్రిపూట రెండిళ్ళు కాపలా కాసేది. రెండు మూడుసార్లు ఆవరణ చుట్టూ ప్రదక్షిణం చేసేది.

దాని సహనశక్తి గొప్పది. ప్రక్క ఇంటివాళ్ళ పిల్లలు దానిమీద ఎక్కి స్వారీ చేసినా ఊరుకునేది. అజ్ఞానంచేత మర్మస్థానం దగ్గర బ్లేడుపెట్టి గంటుపెట్టినా కోపగించేదికాదు. వాళ్ళు పోసే గంజితోనే కాలక్షేపం చేసేది.

దానికి ఆకలి వేసినపుడు రాత్రి ఏడు గంటల సుమారులో వచ్చి సింహద్వారానికి ఎదురుగా నిలబడేది. ఏదయినా వేస్తే తిని, దాని స్థానంలోకి అది వెళ్ళేది. కుక్కలనూ పిల్లులనూ పెంచకూడదని గ్రంథాలలో చదివినా, అంతా నియమంగా ఉండే కుక్కకు మా ఇంట్లో వాళ్ళు ఏదయినా వేస్తే కాదనలేక పోయేవాళ్ళు.

నేను దానిని "భైరవా!" అని పిలిచేవాణ్ణి. తోక ఆడించేది. ఆనందంతో. నేను బైటకు వెళ్ళేటప్పుడు నన్ను ముట్టుకోకుండా కూడా వచ్చి, వీధి చివరి దాకా పంపించేది. ఇంటికి వస్తూ ఉంటే, ఎదురుగా వచ్చి ఆహ్వానిస్తూ ఇంటిదాకా వచ్చేది.

మాటలు దానికి తెలిసినట్లుగా అది ప్రవర్తించేది. ఈ రోజున వెయ్యడానికి ఏమీ లేదు. వెళ్ళమ్మా! అంటే వెంటనే వెళ్ళిపోయేది. ఆలస్యం ఉంది కాసేపు ఆగమంటే అలాగే నిలబడిపోయేది. అన్నం వేస్తుంటేకూడా ఎగబడడం గాని, మనుష్యులను ముట్టుకోవడం గాని చేసేదికాదు. దారికడ్డంగా పడుకుంటే, లెమ్మంటే లేచేది.

కొన్ని జంతువులకు పూర్వజన్మజ్ఞానం ఉంటుందని వినికిడి. కొన్ని ఏకాదశినాడు ఆహార పానీయాలు వర్జిస్తాయని కూడా పత్రికలలో చూస్తూ ఉంటాము. ఈ భైరవుడు ఆ కోవలోకి చెందినట్లుగా కన్పించేది.

రాజమహేంద్రవరంలో ఒక ఆబోతు ఉండేది. ఆ కాలంలో ప్రతి దేవాలయంలోనూ పురాణ పఠనం ఏర్పాటు చేసే వాళ్ళు. ఈ ఆబోతు అల్లాంటి దేవాలయాలకూ, ధర్మశాలలకూ, వెళ్ళేది. ఏయే సమయాలలో ఎక్కడెక్కడ పురాణం చెబుతారో దానికి తెలుసు. అల్లా ఆ సమయాల్లో వస్తుంటే, మొదట్లో అది ఏమి చేస్తుందో అని భయపడ్డారు. అని కూర్చున్న జనంలో నుండి తోచ్చుకు వెళ్ళిపోతే దారి యిచ్చేవారు. సరాసరి పురాణం ప్రవచనం చేసే శాస్త్రుల్లుగారి ఎదుటకు వెళ్ళి అక్కడ పడుకునేది. జనం సర్దుకుని ఆ దారిని మూసేసేవారు. పురాణం కాగానే అది లేచేది. జనం దారి యిచ్చేవారు–యమునానది వసుదేవుడికి సాయ యిచ్చినట్టు.

ఒక్కొక్కప్పుడుపురాణంఆకర్షణీయంగా లేకపోతే మధ్యలోనే లేచిపోయి మరొక దేవాలయానికి వెళ్ళిపోయేది. శాస్త్రుల్లుగారు ఇవాళ ఈ ఘట్టం వృషభరాజుకు నచ్చలేదన్నమాట! అని అనేసేవారు. జనం దారి యిచ్చేవారు. పూర్వజన్మ జ్ఞానం ఉన్న ఆ ఆంబోతుకు పురాణ వృషభం అని పేరు పెట్టారు.

ఒకనాటి రోజున అది పురాణ శ్రవణం చేస్తూనే ప్రాణాలు వదిలింది. ఆ రోజుకు పురాణం ఆపివేసి, దానినిఊరేగించి, అనంతర కృత్యాలు నిర్వహించారు– అక్కడివాళ్ళు.

ఇల్లాంటివి పూర్వజన్మ జ్ఞానం ఉన్న జంతువుల కథలు పెద్దలు చాలా చెబుతారు. ఒక మారు వేదపండితులు కొందరు రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళారట! వారికి గిరి ప్రదక్షిణం చేయాలనే సంకల్పం కలిగింది. అరుణాగిరి ప్రదక్షిణం చెయ్యాలని ఉన్నదనీ, క్రూరజంతువులు ఏమయినా చేస్తాయేమోనని భయంగా ఉన్నదనీ, కావ్యకంఠగణపతిశాస్త్రి గారితో విన్నవించుకున్నారట! అవి ఉంటే ఉంటాయి. మీ దారిని మీరు పని చేసుకుపొండి; భయం లేదు-అని వారు చెప్పారట!

స్వస్తి చెప్పుకుంటూ వారు నగవత్ ప్రదక్షిణం చేశారట! ఇంతలో అందులో ఒకరు వెనక్కి చూసి "అమ్మో! పెద్దపులి!" అన్నారట! మిగిలిన వారు ఉంగారువడి వెనక్కి చూశారట! పెద్దపులి అల్లాగే నిలబడి ఉంది. వీళ్ళ పై ప్రాణాలు పైకిపోతున్న స్వస్తి అనేశారు. దిగాలుపడి నుంచున్నారు. కరుగెత్తితే వెంటపడుతుందేమోనని భయం

పులికి పీరికి మధ్యగా గణపతిశాస్త్రిగారు ప్రత్యక్షమయినారట! "మీ దాని మీరు వెళ్ళండని చెప్పాను కదా! ఎందుకు వేదం ఆపి అల్లా తల్లడిల్లిపోయి నిలబడ్డారు?" అని అడిగారట! వారు పెద్దపులిని వేళ్ళతో చూపించారట!

శాస్త్రిగారు నవ్వారు. "ఆ వ్యాఘ్రం పూర్వ జన్మలో వేదపండితుడు. ఏదో సంచితం కారణంగా ఈ జన్మ వచ్చింది. వేదనాదం విన్పిస్తే చాలు. ఆహ్లాదంతో వారు అనుసరిస్తారు. అపకారం చెయ్యరు" అన్నారట! "దానిని చూస్తే మాకు వేదం నోటి నుండి పెగిలిరాదు. ఇంకా గిరి ప్రదక్షిణం ఏమిటి!" అన్నారట, అందులో ఒకరు. "స్వామీ! మీరు ప్రక్కలనుండి వింటూ అనుసరించండి. వారికిమాత్రం కన్పించవద్దు అని శార్దూల స్వామితో చెబితే, వారు తల ఆడించి, ప్రక్కకు తప్పుకున్న తర్వాత వీరు గిరి ప్రదక్షిణం పూర్తి చేశారట!

మా వీధిలో సీమకుక్కలున్న వాళ్ళున్నారు మరిగుజ్జు కుక్కలున్న వాళ్ళున్నారు. ఇంకా క్రొత్తగా కుక్కలను పెంచేవాళ్ళున్నారు. వాళ్ళందరికీ తుండుముక్కల్లే పెరిగిన ఈ కుక్కను చూస్తే కోపం. ఎందుచేతనంటే వాటినన్నిటినీ ఇదే తఱిమి తఱిమి కొడుతుంది.

ఒక మాటు నేను హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. తిరిగి వచ్చేసరికి మాఅమ్మగారు భైరవుణ్ణి అధికారులు పట్టుకుపోయారని చెప్పింది. చాలా బాధ కలిగింది ఆ రాత్రి నిద్రపోయాను.

తెల్లవారి వివరాలు అడిగాను మాఅమ్మగారు ఇలా చెప్పింది; స్వరాజ్యం రాకముందు దగ్గరనుంచీ ఈ కుక్కలను ప్రతి ఏటా అధికారులు పట్టుకుపోతున్నారటగా? ఎవ్వరో దొరసానికి కుక్క కరిస్తే. ఆమె చచ్చిపోతే ఆమె తాలూకు వారు ఈ ఏర్పాటు చేశారంటున్నారు. విచక్షణలేకుండా ఇల్లా కుక్కలను పట్టుకుపోతుంటే. ఏలూరులో డాక్టర్ తాడేపల్లి అనంతశాస్త్రిగారు వారి వీధిలో కుక్కలకు కొన్నాళ్ళు మెడలో గొలుసులు కూడా వేయించారట అవి పెంపుడు కుక్కలని అనుకోవడానికి. ఆ యాజమాన్యాన్ని తాను స్వీకరించారట ఈ కుక్క మెళ్ళో గొలుసు లేకపోవడం చేత తీసుకుపోయారేమో! మా అమ్మగారు మంచం మీద కూర్చుని కబుర్లు చెప్పే నిపుణే కాని. వాకిట్లోకు వెళ్ళి విషయాలు తెలుసుకునేది కాదు.

అందుచేత ప్రక్క యింటి వాళ్ళని అడిగాను.

"కుక్కల బండి వస్తోందని తెలిసింది. మన కుక్కను ఇంట్లోకి తోలేశాం. అకుక్క ఆగలేదు. వాళ్ళెవరో మా యింటి మీద దండెత్తుతున్నారనే ఉద్దేశంతో, శూరత్వంతో ఆగకుండా ముందుకు వచ్చింది. దానిని వారు పట్టేశారు. అది మంచికుక్క అని మేము మొత్తుకున్నాం.

వారు, తమకు ఈ కుక్కమీద ఈ వీధి వారిలో నుండి పిటిషన్ వచ్చిందనీ అందులో దీనిని పిచ్చికుక్క కఱచినట్లూ, దీనిని కూడా పిచ్చెక్కి జనాన్ని కరుస్తున్నట్లూ ఉంది.

"మీరు ఆఫీసుకువచ్చి, దీనిని మంచి కుక్క అని నిరూపించి లైసెన్సు తీసుకుంటే మీకు తిరిగిఅప్పచెబుతాం. ఇప్పుడు మేమేమీ చెయ్యలేం." అని అన్నారు."

ఆరోజు గడచిపోయింది. మరురోజు లైసెన్సు సొమ్ము చెల్లించి కుక్కను తెచ్చుకుందామని ఇంటి ప్రక్క వారి తాలూకు వాళ్ళు వెళ్ళారు. మున్సిపల్ ఆఫీసువారు మంచి కుక్క అయితే అప్పగించవచ్చునని చీటీ యిచ్చారు. ఆచీటీ తీసుకుని కుక్కలను నిలిపే స్థావరానికి సరాసరి అతడు వెళ్ళిపోయాడు.

కాని, అప్పటికే ఒక గంట క్రిందట క్రరెంటు పాస్‌చేసి చంపివేసిన కుక్కలలో ఈ రాజు కూడా ఉన్నాడట! కుక్కను గుర్తుపట్టి, "రాజూ" అని అతడు కన్నీళ్ళు కార్చాడు. ఇంకెక్కడి రాజు! ఆ జీవుడు ఎప్పుడే వెళ్ళిపోయాడు. ఒక గంటక్రిందట మీరు వచ్చిఉంటే మీరాజు మీకు దక్కేవాడని" అక్కడి వాళ్ళు కూడా విచారించారట!

కుక్కను తీసుకువస్తాడని గంపెడాశతో ఆ యింటివాళ్ళూ మేమూ కూడా ఉన్నాం. ఏడుస్తూ జరిగిన చరిత్ర చెప్పేటప్పటికి చాలా బాధ కలిగింది. ఒక జీవుడికి తనతప్పు లేకుండా అన్యాయం జరిగిపోయింది. ప్రాణమే పోయేటంత అన్యాయం జరిగింది. ఈ పాపం ఎవరిది?

వెళ్ళివచ్చిన అతడు పైవిషయం నాతో చెబుతూ, ఈ వీధిలోనే ఒకాయన ఈకుక్కమీద కాగితం పెట్టాడటండి. ఎందుచేతనంటే వాళ్ళకుక్క పిల్లను ఎప్పుడో ఈ రాజు తరిమిందట! అన్నాడు

"నా రాజును నేను రక్షించుకోలేకపోయాను. అని కూలబడ్డాడు. లైసెన్సు చెల్లించి రాజును తెస్తాడని ఇంట్లో వాళ్ళు అనుకున్న ఆశ నిరాశ అయింది.

సాయంత్రం కాగానే భైరవుడు జ్ఞాపకం వస్తాడు. ఇంటికెదురుగా ఏమయినా వేస్తారేమోనని ఆకలితో నిలబడేవాడు. వెళ్ళేటప్పుడు బయటకు సాగనంపేవాడు. వచ్చేటప్పుడు ఆనందంతో ఆహ్వానించే వాడు! శునక జన్మమెత్త వలసిన వాడు కాడు ఆజీవుడు; ఏ గుడి మణియంలోనో అతనికి పొరబాటు జరిగి ఉంటుంది దాంతో ఆరంగు జాతికుక్క ఏది కన్పించినా. మన భైరవుడేమోననే భ్రాంతి యిప్పటికీ కలుగుతూ ఉంటుంది.

★

## గమనిక

ఇది ప్రత్యేకసంచిక అయిన కారణంగా నిత్యం ప్రచురించే శీర్షికలన్ని ప్రచురించలేక పోతున్నా వచ్చేనెల నుండి సీరియల్సు, తదితర శీర్షికలు మాత్రమే కాకుండా మా విలేకరుల జాబితా సినీతారల ఎన్నికల పోటీలో పాల్గొన్న వారి పేర్లు ప్రచురించగలము. ఈ ప్రత్యేకసంచికలో చదివి, సంచికపై మీ నిశ్చితమైన అభిప్రాయాలు తెలియజేయ వలసినదిగా కోరుచున్నాము.